

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 07-10-2025 | సంపుటి - 25 | సంచిక -143 | రూ : 4 | పేజీలు: 8


# నల్లగా మారుతున్న ఎర్రకోట

## శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆందోళనకర అంశాలు

- ఢిల్లీ ఎర్రకోట రంగు మార్పు
- కాలుష్యం కారణంగా నల్లగా మారుతున్న ఎర్రరాయి గోడలు
- 'బ్లాక్ క్రస్ట్స్' వల్లే సమస్య అని తేల్చిన అధ్యయనం
- వాహన, పారిశ్రామిక కాలుష్యమే ప్రధాన కారణం
- కట్టడం పటిష్ఠతకు ముప్పు అని నిపుణుల హెచ్చరిక



2లో



2లో

## ఆర్టీఐ కొత్త లోగోను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

- సీఎం రేవంత్ రెడ్డితో ఆర్టీఐ కమిషన్ బృందం భేటీ
- జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వక సమావేశం
- 20వ జాతీయ ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా కార్యక్రమం

## విజయవాడ– హైదరాబాద్ హైవేపై రెండో రోజూ అదే సీన్.. తగ్గని వాహనాల రద్దీ



2లో

- 4 కి.మీ. మేర నిలిచిపోయిన వాహనాలు
- ట్రాఫిక్ జామ్ తో ప్రయాణికుల అవస్థలు
- వంతెన నిర్మాణ పనుల వల్ల నెమ్మదిగా కదులుతున్న వెహికల్స్



2లో

## వైద్య శాస్త్రంలో ముగ్గురిని వరించిన

# నోబెల్ బహుమతి

- మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి ప్రతిష్ఠాత్మక పురస్కారం
- రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలు చేసినందుకు నోబెల్
- ఈ నెల 13 వరకు కొనసాగనున్న నోబెల్ బహుమతులు

## సమాజంలో జ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులే



2లో

- శాస్త్రాలతో పాటు శస్త్రాలను కూడా బ్రాహ్మణులు పూజిస్తారన్న రేఖా గుప్తా
- బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రతి ప్రభుత్వం పాటుపడాలని వ్యాఖ్య
- 27 ఏళ్లుగా ఢిల్లీ అభివృద్ధి చాలా నెమ్మదిగా సాగిందన్న రేఖ

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక...

## 14న ఫలితాలు




2లో

* జూబ్లీహిల్స్ సహా పలు రాష్ట్రాల్లోని ఉపఎన్నికలకు షెడ్యూల్ విడుదల
* 13న ఉపఎన్నిక నోటిఫికేషన్, 21 వరకు నామినేషన్ గడువు
* జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,92,669 ఓటర్లు

## విదేశాల్లో చదవాలనుకునేవారికి శుభవార్త చెప్పిన సీఎం చంద్రబాబు



2లో

- విదేశీ విద్యకు పావలా వడ్డీకే రుణాలు అందించేందుకు కొత్త పథకం
- ప్రభుత్వమే గ్యారంటీ.. 14 ఏళ్లలో చెల్లించే వెసులుబాటు
- రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చాలని నిర్ణయం
- 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' అమలు బాధ్యత సంక్షేమ శాఖలకే
- కులవృత్తుల ఆధునికీకరణకు పెద్దపీట.. ఆధునిక పనిముట్లు పంపిణీ
- గత సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1700 కోట్లు

## రికార్డు ధర.. రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు!




4లో

## రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేవారికి అన్ని రకాల మద్దతు: సీఎం రేవంత్‌రెడ్డి

4లో

# విదేశాల్లో చదవాలనుకునేవారికి శుభవార్త చెప్పిన సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 06: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే రాష్ట్ర విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనే కలను నిజం చేసేందుకు, పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు అందించే సరికొత్త పథకాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఎంతమంది విద్యార్థులైనా, ఎలాంటి పరిమితులు లేకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. దేశంలోని ఐఐటీ, ఐఐఎం, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదివే వారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ సంక్షేమ శాఖలపై మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, ఫరూఖ్, సవిత, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విదేశీ విద్యా రుణాలకు 4 శాతం వడ్డీకే బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చూడాలని, దానికి ప్రభుత్వమే గ్యారంటీగా ఉంటుందని హామీ ఇచ్చారు. తీసుకున్న రుణాన్ని 14 ఏళ్లలో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని భావిస్తున్నారు.

*** హాస్టళ్ల రూపురేఖలు మార్పు**

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లను పూర్తిస్థాయి రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలన్నదే తన సంకల్పమని, హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడం ద్వారా ఇది సాధ్యమవుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచి, ఏడాదిలోగా మరమ్మతులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురుకులాల్లో పరిశుభ్రతకు, విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఏర్పాటు చేసి, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలని సూచించారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లను విడుదల చేయకపోవడంతో, విద్యార్థులే రూ.900 కోట్లు చెల్లించారని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఇంకా కాలేజీ యాజమాన్యాలకు రూ.800 కోట్లు బకాయిలు ఉన్నాయని వివరించారు.

**ఆర్థిక సాధికారతే లక్ష్యం**

సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యతను తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలపడతాయని అన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణ తీసుకురావడం ద్వారానే ఆయా వర్గాలు అధిక ఆదాయం పొందగలవని చెప్పారు. ఆదరణ 3 పథకం కింద ఇచ్చే పనిముట్లు ఆధునికంగా, ఉపయోగకరంగా ఉండాలన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మత్స్యకారులు సీవీడ్ వంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. నెల్లూరు, ఏలూరు, కర్నూలులో బీసీ భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఆర్టీఐ కొత్త లోగోను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 06 : తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషన్‌కు కొత్త లోగో వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఈ నూతన లోగోను ఆవిష్కరించారు. 20వ జాతీయ ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ బృందం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ కార్యక్రమానికి ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలోని బృందం హాజరైంది. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సీఎంను కలిసిన వారిలో కొత్తగా నియమితులైన కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, మెర్ల వైష్ణవి ఉన్నారు. కాగా, రాష్ట్రంలో సమాచార హక్కు కమిషన్‌లో చాలాకాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవలే భర్తీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నలుగురు కొత్త కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ల బృందం ముఖ్యమంత్రిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.




## వైద్య శాస్త్రంలో ముగ్గురిని వరించిన నోబెల్ బహుమతి

స్వీడన్, అక్టోబర్ 06: వైద్య శాస్త్రంలో విశేష కృషి చేసినందుకు గాను ప్రముఖ శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. వైద్య విభాగంతో ప్రారంభమైన నోబెల్ పురస్కారాల ప్రకటనలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి. మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందుకు గాను వీరికి ఈ పురస్కారం లభించింది. వీరి పరిశోధనలు పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలుగా పేర్కొనబడే ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు తమ పరిశోధనలు గుర్తించారు.

## విజయవాడ– హైదరాబాద్ హైవేపై రెండో రోజూ అదే సీన్.. తగ్గని వాహనాల రద్దీ

హైదరాబాద్, అక్టోబర్ 06 : దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లిన నగరవాసులు తిరుగు ప్రయాణంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. విజయవాడ-హైదరాబాద్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రెండో రోజు కూడా ట్రాఫిక్ తగ్గకపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నల్గొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఈ సమస్య తలెత్తింది. పంతంగి టోల్ ప్లాజా, చౌటుప్పల్, దండు మల్కాపురం వద్ద కూడా వాహనాల రద్దీ కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చింతలకుంట నుంచి కొత్తపేట వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చింతలకుంట ఫ్లైఓవర్ మీద ట్రావెల్స్ బస్సులు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారింది.

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... 14న ఫలితాలు

హైదరాబాద్, అక్టోబర్ 06 : తెలంగాణ రాష్ట్రంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. తెలంగాణతో సహా వివిధ రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 13న ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 వరకు గడువు ఉంది. నామినేషన్ల పరిశీలన ఈ నెల 22న చేపట్టనుండగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు అక్టోబర్ 24. నవంబర్ 11న పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. తెలంగాణతో పాటు జమ్ము కశ్మీర్, ఒడిశా, ఝార్ఖండ్, మిజోరాం, పంజాబ్, రాజస్థాన్ లో కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల్లోని ఉప ఎన్నికలు, ఫలితాలు ఒకే రోజు వెలువడనున్నాయి. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు.

## సమాజంలో జ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులే: ఢిల్లీ సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 06 : సమాజంలో విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులేనని, వారి సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వం పనిచేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. ఢిల్లీలోని పీతంపురలో శ్రీ బ్రాహ్మణ సభ నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేఖా గుప్తా మాట్లాడుతూ, "సమాజంలో ఎవరైనా విజ్ఞాన దీపాలను వెలిగిస్తున్నారంటే అది మన బ్రాహ్మణ సమాజమే. వారు శాస్త్రాలనే కాదు, శస్త్రాలను కూడా పూజిస్తారు. నేటి సమాజాన్ని, దేశాన్ని కాపాడాలంటే శాస్త్ర, శస్త్రాలు రెండూ ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎల్లప్పుడూ జ్ఞానాన్ని పంచుతూ, ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మంచిని పెంచుతూ సమాజ హితం కోసం పాటుపడ్డారని ఆమె కొనియాడారు. "ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్రాహ్మణులను ముందుకు తీసుకెళ్లేందుకు వారి సంక్షేమానికి కట్టుబడి ఉండాలి" అని ఆమె అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, ఢిల్లీలోని గత ప్రభుత్వాలపై ఆమె విమర్శలు గుప్పించారు. "గత 27 ఏళ్లుగా ఢిల్లీ అభివృద్ధి చాలా మందగమనంతో సాగింది. మన చుట్టుపక్కల రాష్ట్రాలు మనల్ని దాటి ముందుకు వెళ్లిపోయాయి. ఇకనైనా మనం గేర్లు మార్చి వేగం పెంచాల్సిన సమయం వచ్చింది. ఢిల్లీ ప్రజల ప్రయోజనాల కోసం మనమందరం కలిసి పనిచేస్తే... 'వికసిత్ ఢిల్లీ'ని సాధించడం ఖాయం" అని తెలిపారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించి, సమాజ నిర్మాణంలో వారి గౌరవించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేఖా గుప్తా స్పష్టం చేశారు. ఐక్యంగా ఉన్న సమాజం మాత్రమే నిజమైన ప్రగతిని సాధించగలదని ఆమె అన్నారు.

## నల్లగా మారుతున్న ఎర్రకోట.. శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆందోళనకర అంశాలు

ఢిల్లీ, అక్టోబర్ 06 : దేశ రాజధాని ఢిల్లీకి తలమానికంగా నిలిచే చారిత్రక ఎర్రకోట తన సహజ సౌందర్యాన్ని కోల్పోయే ప్రమాదంలో ఉంది. నగరంలోని తీవ్ర వాయు కాలుష్యం కారణంగా 17వ శతాబ్దపు ఈ అద్భుత కట్టడం తన ఎర్రటి రంగును కోల్పోయి నల్లగా మారుతోంది. భారత్ ఇటలీ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని విషపూరిత గాలి ఎర్రకోట రాతి గోడలను రసాయనికంగా దెబ్బతీస్తోందని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. వాహనాల పొగ, పరిశ్రమలు, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి కణాలు గాలిలో కలిసి కోట గోడలపై పేరుకుపోతున్నాయి. దీనివల్ల 'బ్లాక్ క్రస్ట్స్' (నల్లటి గట్టి పొరలు) ఏర్పడుతున్నాయి. ఈ పొరలలో జిప్సం, క్వార్ట్జ్‌తో పాటు సీసం, రాగి, జింక్ వంటి ప్రమాదకరమైన భార లోహాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2021 నుంచి 2023 వరకు సాగిన ఈ అధ్యయన వివరాలను జూన్ 2025లో 'హెరిటేజ్' అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించారు. ఈ నల్లటి పొరలు కేవలం కట్టడం రంగును మార్చడమే కాకుండా, దాని పటిష్టతను కూడా దెబ్బతీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే, గోడలపై ఉన్న సున్నితమైన, అపురూపమైన శిల్పకళ శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రకోటకే కాకుండా ఢిల్లీలోని హుమాయున్ సమాధి వంటి ఇతర చారిత్రక కట్టడాలకు కూడా భవిష్యత్తులో ఇదే ముప్పు పొంచి ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. అయితే, ఈ నష్టాన్ని నివారించడానికి కొన్ని పరిష్కార మార్గాలు ఉన్నాయని పరిశోధకులు సూచిస్తున్నారు. "ఈ నల్లటి పొరలు ఏర్పడటం ప్రారంభ దశలో ఉన్నప్పుడే వాటిని సురక్షితంగా తొలగించడం ద్వారా రాతికి జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తరచూ శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టడం, రాళ్లకు రక్షణ పూతలు వేయడం ద్వారా ఈ చారిత్రక సంపదను కాపాడుకోవచ్చు" అని అధ్యయనంలో పేర్కొన్నారు.

## ఎవరెస్ట్‌పై మంచు తుపాను.. చిక్కుకుపోయిన 1000 మంది

బీజింగ్: ప్రపంచంలోనే అతిపెద్ద పర్వతం ఎవరెస్ట్‌పై మంచు తుపాను బీభత్సం సృష్టించింది. దీంతో వేల అడుగుల ఎత్తులో దాదాపు 1000 మంది పర్వతారోహకులు మంచు శిఖరంపై చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు స్థానికులతో కలిసి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. టిబెట్‌లో ఎవరెస్ట్ పర్వతం తూర్పువాలు వైపు శుక్రవారం సాయంత్రం నుంచి దట్టంగా మంచు కురుస్తోంది. ఆదివారానికి అది మంచు తుపానుగా మారింది. దీంతో దాదాపు 1000 మంది క్యాంప్ సైట్ల వద్ద చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 350 మందిని రక్షించి క్యుడాంగ్ అనే చిన్న టౌన్‌షిప్‌కు తరలించారు. ఎవరెస్ట్ పైకి వెళ్లే మార్గాల్లో భారీగా మంచు చరియలు పడి దారులు మూసుకుపోయాయి. దీంతో వాటిని తొలగించేందుకు వందలాది మంది స్థానికులు, రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. సాధారణంగా ఈ వైపు నుంచే పర్వతారోహకులు, హైకర్లు



ఎక్కువగా ఎవరెస్ట్ పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు చైనాలో సెలవులు కావడంతో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంది. అదే సమయంలో మంచు తుపాను సంభవించడంతో వీరంతా పర్వతంపై చిక్కుకుపోయారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో హైకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది హైకర్లు హైపోథెర్మియా బారినపడినట్లు రెస్క్యూ బృందం వెల్లడించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శనివారం నుంచి ఎవరెస్ట్ పైకి వెళ్లేందుకు అనుమతులు నిలిపివేశారు. సాధారణంగా అక్టోబరులో ఈ మంచు పర్వతంపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మరోవైపు, నేపాల్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడటం కారణంగా ఇప్పటివరకు 52 మంది ప్రాణాలు కోల్పోయారు.

## మీర్పేట్ హెచ్.బి కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ప్రజాస్ఫూర్తి , కాప్రా :మీర్పేట్ హెచ్.బి కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రూ.52 లక్షల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి స్థాయిలో



కృషి చేస్తాను" అని తెలిపారు.తర్వాత ఆయన కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తాం. అభివృద్ధి పనుల్లో ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, వర్క్ ఇన్స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, మల్లారెడ్డి, ఇక్బాల్, అరిపుద్దీన్, వీరభద్రరావు, మల్లేష్ గౌడ్, బోదాసు రవి, వెంకట్, మురళి, నరసింహ గౌడ్, కృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, చక్రవర్తి, దాసు, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి , కాలనీవాసులు పాల్గొన్నారు.

## నిబంధనలను అనుసరించి విధుల్లో పాల్గొనాలి

**– ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ దిశా నిర్దేశం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:రెండవ ఎంపీటీసీ, జెడ్పిటిసి సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బందికి కొత్తగూడెం పట్టణ పరిధిలోని ఆనందఖని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్.వి పాటిల్ పాల్గొని ఎన్నికల నిర్వహణకు ముఖ్యమైన సూచనలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులు ఎన్నికల కమిషనర్ నియమ నిబంధనలను అనుసరించి మాత్రమే విధులు నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ , సాయికృష్ణ , అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్ ) విద్యా చందన, జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.నాగలక్ష్మి, ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారి కె. చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనీస్ సాయికృష్ణ, 52 మంది టీఓటీలు, 57 మంది ఎఫ్ఎస్‌లు, 38 మంది ఎస్ఎస్‌టీలు హాజరయ్యారు.

# అలయ్ బాలయ్ కి తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు...

అందోలు, ప్రజాస్ఫూర్తి : దసరా పండుగ సందర్భంగా అందోల్ నియోజకవర్గ పరిధిలోని వట్ పల్లి లో సోమవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయ్ బలాయ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఇట్టి కార్యక్రమానికి ఆందోల్ మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శేరి మాణిక్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాలలో పెద్ద ఎత్తున సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాణిక్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు




గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.మాజీ సీఎం కెసిఆర్ నాయకత్వంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు మంగళం పాడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై అమలు కానీ గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంపిణి చేసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలు ప్రజలకు తెలిసిందన్నారు. జరగబోయే స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, చిలుకంటి వెంకటేశం, మన్నె యాదగౌడ్, మాజీ వార్డు సభ్యులు గజేందర్ రెడ్డి, కురుమ సంఘం మండల నాయకులు సంగమేశ్వర్, నాయకులు వెంకట్ రెడ్డి, నర్సింహారెడ్డి, వినోద్ రెడ్డి, ధీరాజ్ రెడ్డి,దేవునూరి కృష్ణ, కిషన్, రాజు, ప్రభు తో తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం కి దసరా పండుగ శుభాకాంక్షలు



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం ని వారి నివాసంలో మేడ్చల్ బి బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుర్ర మహేష్, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మదన్ మోహన్ లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జావిద్ అలీ , టీవీ9 ప్రతినిధి కిషోర్ కుమార్, ఘట్కేసర్ మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగులపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకాపురి–సోనియా గాంధీనగర్ కాలనీల మధ్య కల్వర్టు వద్ద మురికిమట్టి తొలగించాలని విజ్ఞప్తి



ప్రజాస్ఫూర్తి , కాప్రా : ద్వారకాపురి కాలనీ , సోనియా గాంధీనగర్ కాలనీల మధ్య ఉన్న కల్వర్టు వద్ద భారీ వర్షాల కారణంగా వరద నీటితో చేరిన మురికిమట్టి, చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ బురదమట్టి వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల ముప్పు పెరిగి, కాలనీ వాసుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని. కాలనీ వాసులు పలుమార్లు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, కాప్రా సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ని ఆశ్రయించి విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని హిటాచి యంత్రం ద్వారా వరదలో కొట్టుకు వచ్చిన మురికిమట్టిని తొలగించి పరిసరాలను శుభ్రపరచాలి. లేనిచో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది అని తెలిపారు.

## వైద్య ఖర్చుల కోసం ఈ ఎల్ వి ఫౌండేషన్ ఆర్థిక సాయం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామానికి చెందిన చిల్లపల్లి రవి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ప్రతి నెల వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25వేలకు పైగా వెచ్చించాల్సి వస్తుందని ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ తెలియజేశారు. ఈ ఎల్ వి భాస్కర్ వెంటనే స్పందించారు. రెండు నెలలకు సరిపడా రూ.50వేల విలువైన మందులను ఈ ఎల్ వి భాస్కర్ పౌండేషన్ సభ్యుల ద్వారా పంపించారు. అట్టి మందులను చిల్లపల్లి రవికి ఫౌండేషన్ సభ్యులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్ కుమార్, బండమీది రాజు, సునీల్, విక్రమ్, నరేష్, రాఘవేంద్ర, ప్రదీప్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి పై కేంద్ర ప్రభారి అధికారిసోలామన్ అరోకియా రాజ్ సమీక్ష

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిని సమీక్షించడానికి, కేంద్రప్రభారి అధికారి సోలామన్ అరోకియా రాజ్ , అదనపు కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాల శాఖ, సోమవారం జిల్లా పర్యటన నిర్వహించారు.ఈ పర్యటనలో భాగంగా ఆయన జిల్లా ప్రధాన కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ, మహిళా , ఇతర అభివృద్ధి సంబంధిత కేంద్రాలను పరిశీలించిన తర్వాత, ఐడిఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. విద్యా రంగంలో ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు పర్యవేక్షణతో అందించడం, పాఠశాలల్లో ఔషధ మొక్కల పెంపకం, విద్యా ప్రమాణాలను పెంపొందించే చర్యలు చేపట్టడం వంటి విషయాలను కలెక్టర్ వివరించారు. ఆరోగ్య రంగంలో తల్లిపిల్లల ఆరోగ్యం, నూతన బ్లడ్ బ్యాంకుల స్థాపన, ఆధునిక వైద్య పరికరాల సమకూర్పు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మేళవించిన వైద్య సేవల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో మునగా, వెదురు అజోల్ల, పుట్టగొడుగుల సాగు, చేపల పెంపకం యూనిట్లు, బయోచార్ తయారీ ఫామ్ పౌండ్ల నిర్మాణం వంటి పథకాల అమలు, అశ్వరావుపేటలో జీవ వనరుల కేంద్రం ఏర్పాటు , మహిళా సంఘాల అభివృద్ధికి కల్పిస్తున్న



సదుపాయాలపై స్పష్టంగా వివరించారు.సమావేశంలో కేంద్రప్రభారి అధికారి సోలామన్ ఆరోకియా రాజ్ ఐఏఎస్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ నిరంతరం పర్యవేక్షణ, సమగ్ర సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయవలసిన అవసరం ఉన్నదని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒక ఆకాంక్షిత జిల్లా కాబట్టి, ప్రతి అభివృద్ధి సూచికపై సమగ్ర దృష్టి పెట్టి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే విధంగా కార్యాచరణ కొనసాగించాల్సినదని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల అభ్యర్థుల ఖర్చు పరిమితులుగుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో అధికారుల సమీక్ష

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు , రాజకీయ పార్టీలు ఖర్చు చేయగల వ్యయ పరిమితులను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి , డీపిఒ రాంబాబు సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల ఖర్చు పరిమితులు , వ్యయ పర్యవేక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ, అభ్యర్థులు ఎన్నికల ఖర్చు పరిమితులను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం జెడ్పిటిసి అభ్యర్థులు రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.1.50 లక్షలు వరకు, సర్పంచ్ అభ్యర్థులు గ్రామపంచాయతీ జనాభా ఆధారంగా రూ.2.50 లక్షలు లేదా రూ.1.50 లక్షల వరకు వ్యయం చేయవచ్చని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.2.50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థికి రూ.50,000ల వ్యయ పరిమితి, 5 వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.1.50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థికి రూ.30,000ల వ్యయ పరిమితి ఉంటుందని వివరించారు.డీపిఒ రాంబాబు మాట్లాడుతూ, అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ప్రచార ఖర్చులు కూడా ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖాతాలో చేర్చబడతాయని



తెలిపారు. ప్రచారంలో వాహనాలు, మైక్ సెట్లు, పోస్టర్లు, బ్యానర్లు, పాంప్లెట్లు మొదలైన వాటి ఖర్చులు కూడా లెక్కలో చూపించాలని సూచించారు.ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల అనంతరం 45 రోజుల్లోపు తమ తుది ఖర్చు నివేదికలను సంబంధిత నియామక అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, ఖర్చు పర్యవేక్షణ కమిటీలు, వీడియో సర్వైలెన్స్ టీములు కఠినంగా పర్యవేక్షణ జరపనున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లక్ష్మణ్ అగర్వాల్, భారతీయ రాష్ట్ర సమి తి అనుదీప్, సిపిఐ పార్టీ శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ నోముల రమేష్, సిపిఐ (ఎం) సత్యనారాయణ సిపిఐ (ఎం సి ) గౌరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## చక్రిపురం కాలనీలో నూతన డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాస్ఫూర్తి , కాప్రా :చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం కాలనీలో ₹30 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల చక్రిపురం వాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసి నిధుల మంజూరు చేయించారని కాలనీ వాసులు తెలిపారు. సోమవారం రోజు ప్రారంభమైన పనులను స్థానిక ప్రజలు సంతోషంతో స్వాగతించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, టీఆర్ఎస్ నాయకుడు మొగలి రాఘవరెడ్డి, కాలనీ అధ్యక్షుడు గడ్డల పాండు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సోమస్వామి, అశోక్, ఉపాధ్యక్షులు కొండారెడ్డి, సహదేవ గౌడ్, వినోద్ నాయి, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొని పనులను పరిశీలించారు.

## మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ



స్టేషన్ ఘన్పూర్, ప్రజాస్ఫూర్తి: డివిజన్ కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చిన్న పొన్న శ్రీనువాస్ తండ్రి పొన్న వెంకటయ్య(72) అనారోగ్యంతో హైద రాబాద్లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం స్టేషన్ ఘన్పూర్లో వెంకటయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళుల ర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూ తిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, నాయకులు పెసరు సారయ్య, కుంభం కుమార్, కర్ర సోమిరెడ్డి, అకారపు అశోక్, సురేశ్కుమార్, చందర్ రెడ్డి, బంగ్లా శ్రీనివాస్, గుండె మల్లేశ్, మారపల్లి ప్రసాద్, వనం రవికిరణ్, గట్టు ప్రశాంత్, గల్లు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో వరదనీటి పైప్ లైన్ పనులు ప్రారంభం

*** 12 లక్షల 50 వేల వ్యయంతో నిర్మాణం**



ప్రజాస్ఫూర్తి , కాప్రా :ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో మంజూరైన రూ.12.50 లక్షల వ్యయంతో వరద నీటి పైప్ లైన్ (స్ట్రామ్ వాటర్ డ్రెయిన్) నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి.మూడు నెలల క్రితం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ వార్డు కార్యాలయం కుమ్మరి బస్తీను సందర్శించిన సందర్భంగా, మధ్యలోనే ఆగిపోయిన కాలువ పనులు వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలు వివరించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కుటుంబ సభ్యులు, మహిళలు, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్, యాదయ్య, చల్ల వెంకటేష్, నల్లచెరువుల జనార్ధన్, కిషోర్, సాయికిరణ్, నరసింహులు, నందు, పిట్ల రాజు, సాయినాథ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సారా అనిల్ ముదిరాజ్, మొగిలి రాఘవరెడ్డి, జై కృష్ణ, శ్రీశైలం, దాసరి కనకయ్య, సంపత్, శేఖర్ నాయక్, వెంకటేష్, సాయిబాబా, ప్రసాద్ రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



**జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

## న్యాయమూర్తి పై దాడి హేయమైన చర్య..

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తామని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్,న్యాయవాది యెర్రా కామేష్అన్నారు.సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ న్యాయవ్యవస్థ గౌరవం కోసం ప్రజలు,సామాజిక ఉద్యమ కారులు అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన అమానుష దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని,ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు,మొత్తం న్యాయవ్యవస్థపై,న్యాయ స్వాతంత్ర్యంపై , రాజ్యాంగ విలువలపై జరిగిన ఘోర దాడి అని మేము ఖచ్చితంగా భావిస్తున్నామని,ఈ దుశ్చర్య న్యాయవృత్తి గౌరవాన్ని దెబ్బతీయడానికి,న్యాయస్ వాతంత్ర్యాన్ని క్షీణింపజేయడానికి చేసిన కుట్రగా భావించాలని,మేము దీనిని కఠినంగా ప్రతిఘటిస్తున్నామన్నారు.న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడటం మనందరి కర్తవ్యమని ప్రజలందరూ న్యాయవ్యవస్థను విశ్వసిస్తూ ప్రజలందరూ నిరసన తెలపాలని కోరారు.న్యాయమూర్తులపై దాడి అంటే,న్యాయం,రాజ్యాంగం,ప్రజా స్వామ్యం పై దాడి.అందువల్ల,న్యాయవృత్తి గౌరవం రక్షణలో మనమందరం ఏకమై నిలుద్దామని,మతోన్మాదుల దుశ్చర్యలు నశించాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రికార్డు ధర.. రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు!

హైదరాబాద్‌లో భూమి రికార్డు ధర పలికింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరా భూమి ఏకంగా రూ.177 కోట్లకు అమ్ముడుపోయింది. టీజీఐఐసీ నిర్వహించిన వేలంపాటలో 7.67 ఎకరాల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ దక్కించుకుంది. మొత్తం రూ.1357 కోట్లతో ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ 7.67 ఎకరాల భూమిని దక్కించుకుంది. టీజీఐఐసీ చరిత్రలో ఇదే రికార్డు ధర కావడం గమనార్హం. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న 18.67 ఎకరాల భూమికి టీజీఐఐసీ సోమవారం వేలంపాట నిర్వహించింది. ఈ మొత్తం భూమిని రెండు భాగాలుగా విభజించింది. 7.67 ఎకరాలను ఒక భాగంగా, 11 ఎకరాలను మరోభాగంగా ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించింది. 11 ఎకరాలను రూ.1,556.5 కోట్లకు ప్రెస్టేజ్ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుంది. ఎకరానికి రూ.141.5 కోట్లు చొప్పున ఆ రియల్ ఎస్టేట్ కంపెనీ వేలం పాడింది. ఎకరా కనీస ధర రూ.101 కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించగా.. ఇందులో పలు సంస్థలు పాల్గొన్నాయి. 2017లో రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో నిర్వహించిన వేలం పాటలో ఎకరం ధర రూ.42.59 కోట్లు పలకగా.. 2022లో నియోపోలిస్, కోకాపేటలో హెచ్ఎండీఏ నిర్వహించిన వేలం పాటలో ఎకరం భూమి రూ.100.75 పలికింది. మూడేళ్ల వ్యవధిలో హైదరాబాద్‌లో భూమి ధర 75శాతం పెరిగిందని టీజీఐఐసీ ఓ ప్రకటనలో తెలిపింది.



ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, జీసీసీలు ఏర్పాటు చేసేందుకు ఉన్న సదుపాయాల వల్ల అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని, అందుకే రియాలిటీ రంగం ఊపందుకుందని టీజీఐఐసీ తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాలనలో తీసుకొచ్చిన పారదర్శకత, అభివృద్ధి వల్ల దేశంలోనే హైదరాబాద్ దూసుకెళ్తోందని పేర్కొంది. మరోవైపు, తెలంగాణ హౌజింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో కూడా రికార్డు ధర నమోదైంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో చదరపు గజం రూ.1.14 లక్షలు పలికింది.



## ఈ నెల 8న
# మెదక్‌లో కేంద్ర బృందం పర్యటన

హైదరాబాద్: ఈ నెల 8వ తేదీన కేంద్ర బృందం మెదక్ జిల్లాలో పర్యటించనుంది. జిల్లాలోని ఐదు మండలాల్లో పర్యటించి వరద నష్టాన్ని పరిశీలించనుంది. మెదక్, నిజాంపేట, రామాయంపేట, హవేలీఘనపూర్, పాపన్నపేటలో కేంద్ర బృందం సభ్యులు పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నారు. ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి ఈ పర్యటన కొనసాగనుంది. ఈ బృందంలో ఆర్థిక, వ్యవసాయ, ఆర్అండ్‌బీ, గ్రామీణాభివృద్ధిశాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులు ఉంటారు.

# అన్ని రకాల రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకం: మంత్రి పొన్నం

ఢిల్లీ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ అంశంలో అసెంబ్లీలో చట్టబద్ధంగా ఆమోదించుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలో పొన్నం మీడియాతో మాట్లాడారు. ''వాస్తవంగా భాజపా అన్ని రకాల రిజర్వేషన్లకు వ్యతిరేకం. బీసీ రిజర్వేషన్లపై చట్ట సవరణ బిల్లు, ఆర్డినెన్స్‌ను



అడ్డుకుంటున్నదే భాజపా నేతలు. రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆ పార్టీ నేతలు ఆమోదించి.. ఇప్పుడు మాట మారుస్తున్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను ఆమోదింపచేయాలి. భాజపా ఫ్యూడలిస్టు పార్టీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. గతంలో రామచందర్‌రావు హెచ్‌సీయూలో ఎస్సీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. శాసనసభలో మద్దతు ఇచ్చిన భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు న్యాయ ప్రక్రియలోనూ సహకరించాలి'' అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేవారికి అన్ని రకాల మద్దతు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి (Revanth Reddy) తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఎలి లిల్లీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఆ సంస్థ అధ్యక్షుడు ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు విన్సెలో టుకర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ ముందుకొచ్చింది. రూ.9 వేల కోట్లతో ప్లాంటు, క్వాలిటీ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థను సీఎం అభినందించారు. ఫార్మా పాలసీని ప్రభుత్వం మరింత ముందుకు



తీసుకెళ్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. ఫార్మాకు సంబంధించిన ప్రముఖులు ఆ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సీఎం వివరించారు.

## ఎంఐఎం మాతోనే..
# జూబ్లీహిల్స్‌లో విజయం మాదే: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌తోనే ఉందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం తమకు మద్దతు ఇస్తుందని తెలిపారు. కంటోన్మెంట్ మాదిరిగా జూబ్లీహిల్స్‌లోనూ విజయం తమదేనంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ టికెట్ బీసీకి వచ్చే అవకాశం ఉందన్న ఆయన.. రెండు మూడు రోజుల్లో అభ్యర్థి పేరు ఖరారవుతుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితులను బట్టి మిత్రపక్షాలకు టికెట్లు ఇస్తామన్నారు. సీపీఎం, సీపీఐ, జనసమితి అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డిసెంబర్ చివరి నాటికి పార్టీ పదవులన్నీ భర్తీ చేస్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు తీర్పు



తాము ముందుగా ఊహించిందేనన్నారు. త్వరలోనే కామారెడ్డి బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

# 'ట్రాప్ హౌస్ పార్టీ'.. ఆరుగురిపై కేసు నమోదు

హైదరాబాద్: మొయినాబాద్ చెర్రీవోక్స్ ఫాంహౌస్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ట్రాప్ హౌస్ పార్టీలో ఆర్గనైజర్లు, డీజే ప్లేయర్లు సహా 65 మంది పాల్గొన్నట్లు గుర్తించారు (Crime News). ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారంతో 59 మంది యువతి, యువకులు పార్టీకి వచ్చారు. 22 మంది మైనర్లు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ఇషాన్ అనే యువకుడు పార్టీ నిర్వహించినట్లుగా గుర్తించారు. ఇషాన్ ఇటీవలే కెనడా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్‌హౌస్ పేరిట పేజీ క్రియేట్ చేశాడు. అక్టోబర్ 4న చెర్రీవోక్స్ ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహించాడు. ఒక్కరికైతే రూ.1,600, జంటగా వస్తే రూ.2,800గా ధర నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఇది చూసిన మైనర్లు పార్టీకి సిద్ధమయ్యారు.



మత్తులో జోగుతున్న సమయంలో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న వారికి నిర్వహించిన డ్రగ్ పరీక్షలో ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్టు నిర్ధరణ అయింది. ఆరుగురు నిర్వాహకులను, 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మొయినాబాద్ ఠాణాలో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..
# కొత్త ఓటర్ల నమోదుకు 10 రోజుల సమయం



హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వెంటనే పోస్టర్లు, బ్యానర్లను తొలగిస్తామని చెప్పారు. నవంబర్ 11న పోలింగ్ ఉండనుందని.. 14న కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు 4 లక్షల మంది ఓటర్లు ఉన్నారని.. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి ఇంకా పది రోజుల సమయం ఉందని చెప్పారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలున్నట్లు తెలిపారు. కోడ్ ఉల్లంఘిస్తే పార్టీలకు అతీతంగా కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

# జర్నలిస్టులకు బిగ్ అలర్ట్.. ప్రెస్ క్లబ్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ 2025-27 ఎన్నుకునేందుకు అక్టోబర్ 26వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని హైదరాబాద్ ప్రెస్ కబ్ల్ జనరల్ సెక్రటరీ రవికాంత్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. దొడ్డ శ్రీనివాస్ రెడ్డి ఎన్నికలను రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష(జనరల్), ఉపాధ్యక్ష (ఉమెన్), ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు(2), ట్రెజరర్, కార్యనిర్వహక సభ్యులు(10) ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్ట్ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే




అక్టోబర్ 9వ తేదీవరకు తెలపాలని పేర్కొన్నారు. నామినేషన్ ఫారంల ప్రక్రియ అక్టోబర్ 12, 13 తేదీలలో, నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 14, 15 తేదీలలో ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితిలలో పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు కొనసాగుందని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో
# నకిలీ డాక్టరేట్లు ప్రదానం చేస్తున్న వ్యక్తి అరెస్టు

హైదరాబాద్: నకిలీ డాక్టరేట్లను ప్రదానం చేస్తున్న పెద్దిటి యోహాను అనే వ్యక్తిని వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రవీంద్ర భారతిలో పలువురికి సర్టిఫికెట్లను అందజేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అతడిని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. నిందితుడి నుంచి నకిలీ డాక్టరేట్ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ పేరుతో డబ్బులు తీసుకుని వీటిని ప్రదానం చేస్తున్నట్లు గుర్తించారు. సాహిత్యం, కళలు విభాగంతో వీటిని ఇస్తున్నారు. ఈమేరకు



యోహానుపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బెంగుళూరులో మల్లికార్జున ఖర్గేను పరామర్శించిన సీఎం రేవంత్..
## పలు కీలక అంశాలపై చర్చలు..!

తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి సోమవారం కర్ణాటకకు వెళ్లారు. బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఇటీవల ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆయన బెంగళూరులోని ప్రఖ్యాత ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలోనే మల్లికార్జున్ ఖర్గేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు, సుప్రీంకోర్టులో విచారణ అంశాలు ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి కీలక చర్చలు జరిపినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఖర్గేను కలిసిన విషయాన్ని ఎక్స్ వేదికగా తెలిపారు. 'ఇటీవల అనారోగ్యానికి గురై పేస్ మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స చేయించుకుని, బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకుని, తిరిగి ప్రజా జీవితంలో క్రియాశీలకంగా పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.' అని తెలిపారు.



# సీజేఐపై దాడికి యత్నం.. ఖండించిన ప్రధాని

సుప్రీం కోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడి చేసేందుకు యత్నించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు ఖండించారు. ''సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడాను. సుప్రీం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ ఘటన.. ప్రతి భారతీయుడినీ ఆగ్రహానికి గురిచేసింది. సమాజంలో ఇటువంటి దుశ్చర్యలకు చోటు లేదు. అటువంటి పరిస్థితుల్లోనూ ఆయన ప్రశాంతంగా వ్యవహరించడం ప్రశంసనీయం. న్యాయ విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని బలోపేతం చేయడం పట్ల ఆయన నిబద్ధతకు ఇదే నిదర్శనం'' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ''భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి.. మన న్యాయవ్యవస్థ గౌరవంపై, రాజ్యాంగ స్ఫూర్తిపై జరిగిన దాడితో సమానం. ఇటువంటి ద్వేషానికి మన దేశంలో స్థానం లేదు. దీన్ని మనమంతా ఖండించాలి'' రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ''సీజేఐపై దాడికి యత్నించడం అత్యంత కలవరపరిచే ఘటన. సనాతన ధర్మమంటే చట్టపరమైన విధానాన్ని గౌరవించడమే. రాజ్యాంగాన్ని గౌరవించడమే సనాతన సంస్కృతి ప్రాథమిక బోధన. న్యాయం ఆవేశం ద్వారా సాధించేది కాదు. హింసాత్మక చర్యలకు సనాతన ధర్మంలో స్థానం లేదు'' పవన్ కల్యాణ్, ఏపీ డిప్యూటీ సీఎం ఈ వ్యవహారంలో సంబంధిత న్యాయవాది రాకేశ్ కిశోర్ లైసెన్సును 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' రద్దు చేసింది. తక్షణమే ఇది అమల్లోకి వస్తుందని తెలిపింది. మరోవైపు.. దిల్లీ పోలీసులు సుప్రీం కోర్టు ప్రాంగణంలోనే ఆయన్ను మూడు గంటల పాటు విచారించారు. అధికారికంగా ఎటువంటి ఫిర్యాదు నమోదు కాకపోవడంతో బయటకు వెళ్లేందుకు అనుమతించారు.

## నవంబర్ 6 నుంచి బిహార్‌లో ఎన్నికలు.. రెండు విడతల్లో పోలింగ్




దిల్లీ: బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది. పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బిహార్‌లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో జేడీయూ, భాజపా కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్డీయేను వీడి.. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో మహాగఠ్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధమూ ఎంతోకాలం నిలవలేదు. 2024 జనవరిలో మహా కూటమిని వీడిన జేడీయూ మళ్లీ ఎన్డీయేతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

**ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు ఉంటే..** బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు ''ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం'' అని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు. 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని, వారిలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. రద్దీ నిర్వహణ కోసం ఒక్కో బూత్‌లో 1200 మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వేసే ప్రక్రియను ఈ ఎన్నికలతోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు..**

ఏడు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్‌లోని అంతా, ఝార్ఖండ్‌లోని ఘట్‌శిలా, తెలంగాణలోని జూబ్లీహిల్స్, పంజాబ్‌లోని తర్న్‌తారన్, మిజోరంలోని దంపా, ఒడిశాలోని నౌపాడాతోపాటు జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని బద్గామ్, నగ్రోటా స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని ఈసీ వెల్లడించింది.

## 5జీ నెట్‌వర్క్ టెస్టింగ్.. ఐఐటీ మద్రాస్ ప్రవర్తక్ ల్యాబ్‌కు అనుమతి

చెన్నై: దేశీయ టెలికాం విభాగంలో కీలక ముందుడుగు పడింది. ఐఐటీ మద్రాస్ ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్‌కు చెందిన టెలికాం సెక్యూరిటీ టెస్టింగ్ ల్యాబ్‌కు టెలికాం విభాగం నుంచి కీలక గుర్తింపు లభించింది. 5G కోర్ నెట్‌వర్క్ ఫంక్షన్, యాక్సెస్ అండ్ మొబిలిటీ మేనేజ్‌మెంట్ ఫంక్షన్ (AMF), 5G గ్రూప్ 1 డివైజ్‌లను పరీక్షించేందుకు ఈ ల్యాబ్‌కు అనుమతిచ్చింది. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ కమ్యూనికేషన్ సెక్యూరిటీ (NCCS) సర్టిఫికెట్ జారీ చేసింది. 5G కాంపోనెంట్‌ల సెక్యూరిటీ పరీక్షల కోసం దేశంలోనే మొదటి ల్యాబ్‌గా 'ప్రవర్తక్' గుర్తింపు పొందింది. దేశ టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో స్వావలంబన కోసం చేస్తున్న ప్రయత్నాలకు దీని ద్వారా




ఊతమిచ్చినట్లయ్యింది. ఈ ల్యాబ్‌కు గుర్తింపు వల్ల దేశంలో సురక్షిత 5G ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోల్‌అవుట్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు విదేశీ ల్యాబ్‌లపై ఆధారపడాన్ని తగ్గిస్తుందని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి తెలిపారు. ఈ గుర్తింపు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ముందడుగని ఐఐటీ ప్రవర్తక్ సీఈవో డాక్టర్ శంకర్ రామన్ పేర్కొన్నారు. సైబర్ భద్రతలో భారతదేశాన్ని ముందంజలో నిలుపుతుందని చెప్పారు.

## బిహార్‌లో 'ఆప్' ఎంట్రీ.. అన్ని స్థానాల్లో పోటీకి సై!

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బిహార్‌లో రాజకీయాలు మరింత జోరందుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో (243) పోటీ చేయనున్నట్లు 'ఆమ్ ఆద్మీ పార్టీ' ప్రకటించింది. 11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను కూడా విడుదల చేసింది. ఇప్పటికే జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన 'ఆప్'.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనుండటం ఇదే తొలిసారి. దిల్లీ, పంజాబ్‌లో అనుసరించిన పాలనా విధానాలను బిహార్‌లోనూ అమలు చేస్తామని పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి అజేశ్ యాదవ్ తెలిపారు. ''అభివృద్ధి, పాలనకు సంబంధించి మా దగ్గర విజయవంతమైన నమూనా ఉంది. ప్రజా సంక్షేమం విషయంలో ఆప్ చేసిన పనులు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. గతంలో దిల్లీలో ఆప్ ప్రభుత్వ ఏర్పాటుకు పూర్వాంచల్ ప్రాంత ప్రజలు సహకరించారు. ఇప్పుడు బిహార్‌లోనూ అండగా నిలుస్తారని ఆశిస్తున్నామని పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విశ్వాసం వ్యక్తం చేశారు'' అని అజేశ్ పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల్లో ఇతర పార్టీలతో జట్టుకట్టే అంశాన్ని ఆప్ రాష్ట్ర సహాయక ఇన్‌ఛార్జి అభినవ్ రాయ్ తోసిపుచ్చారు. ప్రజలతోనే తమకు పొత్తు ఉందని పేర్కొన్నారు. ఇతర పార్టీలు, కూటములతో కలసి పోటీ చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఇప్పుడిప్పుడే సంస్కరణల గురించి మాట్లాడటం ప్రారంభించారని, వాటిని తాము ఇప్పటికే క్షేత్రస్థాయిలో అమలు చేశామన్నారు.

**రెండు విడతల్లో ఎన్నికలు..**

బిహార్‌లో రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6, నవంబర్ 11న ఓటింగ్ ప్రక్రియ జరగనుంది.




నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని, 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని చెప్పారు. ఓటర్లలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారు.

## వారు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారు?
### : రష్యా మహిళ కేసులో సుప్రీం

కర్ణాటకలోని గోకర్ణ గుహలో రహస్య జీవనం సాగిస్తూ కనిపించిన రష్యన్ మహిళ కేసులో సుప్రీం కోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె ఇద్దరు పిల్లలకు తండ్రిగా చెబుతున్న వ్యక్తిపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిల్లలు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. గోకర్ణ గుహలో రహస్యంగా జీవించిన నైనా కుటినా (40), తన ఇద్దరు కుమార్తెలు ప్రస్తుతం పోలీసుల సంరక్షణలో ఉన్నారు. తన భర్త ఇజ్రాయెల్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అని ఆమె వెల్లడించారు. ఆ కుమార్తెల తండ్రిని తానేనని, వారిని రష్యాకు తరలించొద్దని ఇజ్రాయెల్ దేశస్థుడు గోల్డ్‌స్టీన్ ఇటీవల సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో విచారణ జరిగింది. ''వాళ్లు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారు. ఈ దేశం అందరికీ స్వర్గధామంగా మారింది. ఎవరైనా వచ్చి ఇక్కడ ఉండిపోవచ్చని అనుకుంటున్నారు'' అని అసహనం వ్యక్తం చేసింది. జులై 11న గుహలో నైనా కుటినాను గుర్తించగా.. అప్పుడు ఆమె వద్ద ఎలాంటి చట్టబద్ధ పత్రాలు లభించలేదు. దీనిపై స్పందించిన రష్యా ఎంబసీ అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేసింది. అప్పుడే గోల్డ్‌స్టీన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఇద్దరు తన పిల్లలని, వారిని రష్యాకు తరలించవద్దని కోరారు. తన పిల్లల జాడ తెలియకపోవడంతో గత ఏడాది పనాజీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని కూడా తెలిపారు. అయితే హైకోర్టు అతడి పిటిషన్‌ను కొట్టివేసింది. నైనా, ఆమె పిల్లల్ని రష్యాకు పంపేలా కేంద్రం తీసుకుంటున్న చర్యలను అనుమతించింది. సాధ్యమైనంత త్వరగా తాను రష్యా వెళ్లాలనుకుంటున్నానని ఎంబసీ వద్ద నైనా చెప్పిన విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. మరోవైపు ఆ తల్లీపిల్లలు గుహలో ఎందుకు జీవిస్తున్నారో గోల్డ్‌స్టీన్ న్యాయస్థానం ఎదుట సరైన సమాధానం చెప్పలేకపోయారు. తాజా విచారణలో సుప్రీంకోర్టు కూడా అదే ప్రశ్న వేసింది. అసలు మీ హక్కు ఏంటి? మీరు



ఎవరు? అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఆ పిల్లలకు తండ్రినని సమాధానం ఇవ్వగా.. దానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగింది. ఇదొక పబ్లిసిటీ వ్యాజ్యంలా ఉందని కూడా వ్యాఖ్యానించింది. అలాగే తన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు గోల్డ్‌స్టీన్‌కు అనుమతి ఇచ్చింది.

### రాళ్లు రువ్వడంతో..
## భాజపా ఎంపీ తలకు గాయాలు

పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ మాల్దా నియోజకవర్గ ఎంపీ ఖగెన్ ముర్ము తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఆయనపై రాళ్ల దాడి జరిగింది. వరద ప్రభావిత ప్రాంతం జల్‌పాయిగుడీలో భాజపా ప్రతినిధుల బృందం పర్యటిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పుడు ఖగెన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే శంకర్ ఘోష్ వరద సహాయాన్ని పంపిణీ చేస్తున్నారని సమాచారం. ఈ దాడికి ముందు భాజపా ప్రతినిధులను అడ్డుకునేందుకు 500 మందికిపైగా వ్యక్తులు రహదారులను దిగ్బంధించారు. 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. గాయపడిన ఎంపీ, ఎమ్మెల్యేకు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. మరోవైపు ఈ ఘటనపై భాజపా తీవ్రంగా స్పందించింది. 'బెంగాల్‌లో తృణమూల్ ఆటవిక రాజ్యం నడుస్తోంది' అని ఆ కమలం పార్టీ నాయకుడు అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. భారీ వర్షాలు,




వరదలు, కొండచరియలు విరిగిపడటంతో అతలాకుతలమైన ప్రభావిత ప్రాంతానికి ఎంపీ వెళ్తుండగా.. టీఎంసీ గుండాలు దాడికి పాల్పడ్డారని అమిత్ మండిపడ్డారు. వరద బాధితులను ఆదుకోవడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో అధికార, విపక్ష పార్టీల మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## సీజేఐపై దాడికి యత్నం.. ఇలాంటి బెదిరింపులు ప్రభావితం చేయలేవన్న జస్టిస్ గవాయ్

దిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసేందుకు ఓ న్యాయవాది యత్నించాడు. ఈ ఊహించని పరిణామంతో అక్కడున్నవారంతా కలవరపాటుకు గురయ్యారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో భాగంగా వాదనలు జరుగుతుండగా ఓ న్యాయవాది సీజేఐపైకి బూటు విసిరేందుకు యత్నించాడు. గమనించిన భద్రతా సిబ్బంది



వెంటనే అతడిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. అనంతరం తన విచారణను కొనసాగించారు.

## నేవీ అమ్ములపొదిలో మరో అస్త్రం.. సాగర జలాల్లోకి యుద్ధ నౌక 'ఆండ్రోత్'

తీర ప్రాంతానికి చేరువలోని సాగరజలాల్లో శత్రు జలాంతర్గాముల ఉనికిని పట్టేసే యుద్ధనౌక 'అండ్రోత్' భారత నౌకాదళంలో చేరింది. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రెండో 'యాంటీసబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్' 'ఆండ్రోత్' జలప్రవేశం చేసింది. నేవీ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధర్కర్ ఆధ్వర్యంలో దీన్ని కమిషనింగ్ చేశారు. భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయిగా నిలిచింది. కోల్‌కతాలోని ప్రభుత్వరంగ నౌకా నిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని రూపొందించింది. ఈ శ్రేణిలో ఇది రెండో యుద్ధనౌక. మొదటిది ఐఎన్ఎస్ అర్నాలా. అది జూన్ 18న లాంఛనంగా భారత నౌకాదళంలో చేరింది. లక్షదీవుల్లోని అండ్రోత్ అనే దీవి పేరును రెండో యుద్ధనౌకకు ఖరారు చేశారు. ఆండ్రోత్



యుద్ధ నౌకలో దేశీయంగా రూపొందించిన 30 ఎంఎం సర్ఫేస్ గన్ ఉంది. లోతు తక్కువగా ఉన్న జలాల్లోని జలాంతర్గాములను వేటాడే 16 అధునాతన నౌకలకు నేవీ ఆర్డర్ పెట్టింది. ఇందులో ఎనిమిదింటిని జీఆర్ఎస్ఈ ఉత్పత్తి చేస్తోంది. తీర ప్రాంతానికి చేరువలోని జలాలపై నిఘా వేసే సామర్థ్యం వీటికి ఉంది. విమానాలతో సమన్వయం చేసుకుంటూ శత్రు జలాంతర్గాములను వేటాడగలవు. అధునాతన పోరాట నిర్వహణ వ్యవస్థలు వీటి సొంతం. ఈ యుద్ధనౌకల్లో తేలికపాటి టోర్పిడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు ఉన్నాయి.

# స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అవార్డులను ప్రదానం చేసిన సీఎం చంద్రబాబు

విజయవాడ: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన సంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వ శాఖలకు విజయవాడలో స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ స్వచ్ఛతను పాటించటంలో అగ్రస్థానంలో ఉన్న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలకు సీఎం అవార్డులు ప్రదానం చేశారు. 21 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో 69 అవార్డులు, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులు విజేతలకు అందించారు. స్వచ్ఛ మున్సిపాల్టీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ స్కూల్స్, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్ స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమల కేటగిరీల్లో అవార్డులు ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు గానూ రాష్ట్ర స్థాయిలో 6 మున్సిపాలిటీలు, 6 గ్రామ పంచాయతీలు అవార్డులు అందుకున్నాయి. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తాడిపత్రి, బొబ్బిలి, పలమనేరు, ఆత్మకూరు, కుప్పం మున్సిపాలిటీలు సీఎం చేతుల మీదుగా అవార్డులు పొందాయి. స్వచ్ఛ గ్రామ పంచాయితీలుగా ఎంపికైన అనకాపల్లి జిల్లా చౌడువాడ, ప్రకాశం జిల్లా ఆర్‌ఎల్ పురం, కోనసీమలోని లోల్ల, కృష్ణా జిల్లాలోని చల్లపల్లి, కడప జిల్లాలోని చెన్నూరు, చిత్తూరు జిల్లాలోని కనమకులపల్లె సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్నాయి. స్వచ్ఛతకు పెద్దపీట వేసిన పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, స్వయం సహాయక సంఘాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు అవార్డులు అందించారు.






## కురుపాం గిరిజన పాఠశాలను సందర్శించిన మంత్రి అచ్చెన్న

కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. కురుపాం గిరిజన పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలను తెలుసుకున్నారు. ఈ ఘటనపై వైద్య, గిరిజన, సంక్షేమ శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేపట్టారు. బాలికల అస్వస్థతకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ ఘటనను సీఎం పర్యవేక్షిస్తున్నారని.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విశాఖపట్నం కేజీహెచ్, పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

## అగ్నిప్రమాద బాధితులకు మంత్రి నారాయణ భరోసా



నెల్లూరు: నెల్లూరులోని సంతపేట మార్కెట్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. వ్యాపారులను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. అగ్నిప్రమాదం గురించి తనకు తెలియగానే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశానన్నారు. ప్రమాదానికి గురైన దుకాణాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. బాధితులకు పరిహారం కూడా త్వరలోనే అందజేస్తామని వెల్లడించారు. మార్కెట్‌లో వ్యాపారులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.



## తిరుపతి ఎస్వీ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

తిరుపతి: తిరుపతి ఎస్వీ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. వర్సిటీ సమీపంలో సీఎం చంద్రబాబు పర్యటన కోసం అధికారులు హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ వద్ద 5 ఆర్‌డీఎక్స్ ఐఈడీ బాంబులు పెట్టినట్లు ఈమెయిల్ వచ్చింది. దీంతో హెలిప్యాడ్ పరిసరాల్లో బాంబు స్క్వాడ్, పోలీసుల విస్తృత తనిఖీలు చేపట్టారు. మంగళవారం సీఎం చంద్రబాబు నారావారిపల్లికి రానున్నారు.

## ఉద్యోగులకు గుడ్ న్యూస్.. డీఏ విడుదలపై ప్రభుత్వం కసరత్తు

ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో గుడ్ న్యూస్ లభించింది. బకాయి డీఏలు విడుదల చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే త్వరగా తమ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం కేబినెట్ భేటీలో చర్చించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 10న కేబినెట్ భేటీ నిర్వహించనున్నారు. ఉద్యోగులకు ఒక డీఏ విడుదలపై చర్చించ



నున్నారు. మంత్రులు ఆమోద ముద్ర వేయగానే డీఏ విడుదల చేయనున్నారు. అయితే ఆదివారమే కేబినెట్ భేటీ జరిగింది. మళ్లీ వెంటనే కేబినెట్ భేటీ జరగనుండటంతో చర్చనీయాంశంగా మారింది.

## 2019లో తెదేపా గెలిచి ఉంటే.. 2022 నాటికే పోలవరం పూర్తయ్యేది

**: మంత్రి నిమ్మల**

దిల్లీ: వైకాపా హయాంలో పోలవరం విధ్వంసం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జల్‌శక్తి మంత్రి నేతృత్వంలో దిల్లీలో కీలక సమావేశం జరిగింది. ప్రాజెక్టు పురోగతి, నిధులు విడుదల, పునరావాసంపై సమీక్షించారు. ఈ సమావేశానికి మంత్రి నిమ్మల రామానాయుడు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "201419 మధ్య పోలవరం పనులు 72 శాతం పూర్తయ్యాయి. వైకాపా హయాంలో పోలవరం విధ్వంసం జరిగింది.



ప్రాజెక్టు భవితవ్యాన్ని గత సీఎం ప్రశ్నార్థకంగా మార్చారు. పడకేసిన పోలవరం ప్రాజెక్టును మా ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కించింది. సీఎం చంద్రబాబు తొలి క్షేత్రస్థాయి పర్యటన కోసం పోలవరానికి వెళ్లారు. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నూతన డయాఫ్రమ్ వాల్ పనులు 56 శాతం పూర్తయ్యాయి. భారీ వర్షాలు పడుతున్నా పనులు ఆగలేదు. గడువులోగా పోలవరం పూర్తి చేయాలనే చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. 2019లో తెదేపా గెలిచి ఉంటే.. 202122 నాటికే పోలవరం పూర్తయ్యేది. వైకాపా హయాంలో రివర్స్ టెండరింగ్ పేరిట పోలవరం పనులు ఆపేశారు" అని మంత్రి విమర్శలు గుప్పించారు.

## ఏపీలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి.. టాటా గ్రూపు ఛైర్మన్‌కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

ముంబయి: టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో త్వరలో నిర్వహించనున్న టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని టాటా గ్రూపు ప్రతినిధులను ఆహ్వానించారు. అలాగే, ఏపీలో జరుగుతోన్న అభివృద్ధిలో టాటా గ్రూపు భాగస్వామ్యం కావాలని, అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈవీల ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, రూఫ్‌టాప్ సోలార్ అభివృద్ధిలో కలిసి పనిచేయాలని, సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో టాటా ఎలక్సీ సెంటర్, పలు రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. శ్రీసిటీలో ఈవీ భాగాలు తయారీ యూనిట్లు స్థాపించాలని కోరారు. భూమి, ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ప్రత్యేక ప్రోత్సాహకాలను సైతం ఇస్తుందని భరోసా ఇచ్చారు. శ్రీసిటీలో ఇంజినీరింగ్



సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించాలని కోరిన ఆయన.. టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో ఓఎస్‌ఏటీ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ముంబయిలో జరిగిన ఈ భేటీలో టాటా పవర్ రెన్యూవబుల్స్ సీఈవో సంజయ్ కుమార్ బంగా, ఇండియా హోటల్స్ ఎండీ పునీత్ ఛత్వాల్, టాటా ఎలక్సి సీఈవో మనోజ్ రాఘవన్, టాటా ఆటో కాంప్ సీఈవో మనోజ్ కోల్హాత్కర్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈవో సుకరన్ సింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ రణధీర్ ఠాకూర్, టాటా కెమికల్స్ ఎండీ ఆర్. ముకుందన్, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సీఈవో వినాయక్ పాయ్, ఎస్‌టీ టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ సీఈవో బిమల్ ఖండేల్వాల్ పాల్గొన్నారు. అలాగే, గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్లాట్‌ఫాం ఈఎస్‌ఆర్ గ్రూప్ ఇండియా ఇన్వెస్టిమెంట్స్ అధిపతి సాదత్ షా, డైరెక్టర్ (లీజింగ్) ప్రకృత్ మెహతాతోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ముంబయిలోని తాజ్ ల్యాండ్స్ హోటల్‌లో జరిగిన ఈ భేటీలో ఏపీ సముద్ర ఎగుమతుల కోసం కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు, గిడ్డంగుల నిర్మాణం, పోర్టు ఆధారిత లాజిస్టిక్స్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా వారికి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

## బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు : మంత్రి అనిత

విశాఖపట్నం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను హోంమంత్రి అనిత పరామర్శించారు. బాధితులతో ఆమె మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో అనిత మాట్లాడారు. "బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. వైద్య నిపుణులతో ఓ కమిటీ వేశాం. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోంది. పాఠశాలల్లో



ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో ఇద్దరు గిరిజనులు డిప్యూటీ సీఎంలు అయ్యారు. కనీసం ఒక్కసారైనా ఆశ్రమ పాఠశాలలను సందర్శించారా? కూటమి ప్రభుత్వంలో మంత్రులమంతా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అధికారులు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. జగన్‌కు మాట్లాడే హక్కు లేదు" అని అనిత అన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.. 25 వాహనాలు స్వాధీనం

మోటార్ సైకిల్ దొంగతనాల కేసులను మదనపల్లి పోలీసులు ఛేదించారు. అన్నమయ్య, తిరుపతి జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలో వరుసగా వాహన దొంగతనాలు జరిగాయి. ఈ కేసు నిందితుడిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. రూ. 13.50 లక్షలు విలువ చేసే 25 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు బసినికొండ పంచాయతీ పరిధిలోని ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. పులి వెంకటరెడ్డి (33)



అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వివిధ ప్రాంతాల్లో వాహన దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది.

## శ్రీవారి భక్తులకు బిగ్ అలర్ట్.. దర్శనానికి 24 గంటల సమయం

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వరుడి దివ్య సన్నిధి తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. ఈ మేరకు టోకెన్లు లేని భక్తుల దర్శనానికి సుమారు 24 గంటల సమయం పడుతోంది. ఇక రూ.300 ప్రత్యేక దర్శనానికి టోకెన్ తీసుకున్న వారికి కేవలం 5 నుంచి 6 గంటల్లో శ్రీవారి దర్శనం అవుతోంది. ఇక సోమవారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్‌లు భక్తులతో కిక్కిరిపోయి.. క్యూలైన్ శిలాతోరణం వరకు ఉంది. ఆదివారం స్వామి వారిని 83,412 మంది భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా 33,058 మంది భక్తులు తమ తలనీలాలు సమర్పించి స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

# బంగారం పరుగులు..

## తులం రూ.1.23 లక్షలు



**న్యూఢిల్లీ:** ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. సంపన్నులకే దడ పుట్టించేలా ప్రస్తుతం బంగారం రేట్లు పెరుగుతూపోతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,23,420కి చేరింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ. 1,10,700గా ఉంది.

పసిడి ధరలు పెరగడానికి అనేక కరాణాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులకు తోడు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ కూడా ఓ కారణంగా పేర్కొంటున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధర ఔన్సు 3,935 డాలర్లుగా నమోదైంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. దీపావళి నాటికి బంగారం ధర 10 గ్రాములు రూ.1.25 లక్షలకు చేరుకుంటుందని అంచనా. మరోవైపు వెండి ధర కూడా బంగారంతో పోటీపడి మరీ పెరిగిపోతోంది. కిలో వెండి ధర రూ.లక్షన్నర దాటింది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.54 లక్షలుగా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

## లాభాల హ్యాట్రిక్...
## మార్కెట్లలో కొనసాగిన బుల్ రన్

- వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- 582 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 183 పాయింట్లు లాభపడిన నిఫ్టీ
- కీలకమైన 25,000 మార్కును అధిగమించిన నిఫ్టీ
- ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు
- టీసీఎస్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు టాప్ గెయినర్స్
- లోహ, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల హ్యాట్రిక్ కొట్టాయి. ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరగడంతో సోమవారం నాడు సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. వరుసగా మూడో సెషన్‌లో కూడా బుల్ జోరు కొనసాగడంతో కీలకమైన నిఫ్టీ 25,000 మార్కును అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 582.95 పాయింట్లు ఎగబాకి 81,790.12 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 183.4 పాయింట్లు లాభపడి 25,077 వద్ద ముగిసింది.

ట్రేడింగ్‌లో ఐటీ రంగం షేర్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 2.28 శాతం పెరిగింది. ప్రైవేట్ బ్యాంక్, ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ రంగాల సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి. అయితే, లోహ (మెటల్), ఎఫ్ఎంసీజీ, మీడియా రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఈ రంగాల సూచీలు దాదాపు 1% వరకు నష్టపోయాయి. సెన్సెక్స్-30లో టీసీఎస్, టెక్ మహీంద్రా, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు 3 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు ట్రెంట్, టాటా స్టీల్, పవర్ గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టాలను చవిచూశాయి.

బ్యాంక్ నిఫ్టీ కూడా సోమవారం అద్భుతమైన పనితీరు కనబరిచింది. గ్యాప్-అప్ ఓపెనింగ్‌తో ప్రారంభమై రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రా-డేలో 56,164 గరిష్ఠ స్థాయిని తాకింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాల బాటలోనే పయనించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.89 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.28 శాతం చొప్పున లాభపడ్డాయి.

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీ కీలకమైన 25,000 స్థాయిని అధిగమించడం మార్కెట్‌కు సానుకూల సంకేతమని విశ్లేషకులు తెలిపారు. "ఒకవేళ సూచీలు దిగివచ్చినా 25,000 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభించవచ్చు. తదుపరి నిరోధ స్థాయిలు 25,200, 25,500 వద్ద ఉన్నాయి," అని వారు పేర్కొన్నారు. త్వరలో వెలువడనున్న రెండో త్రైమాసిక ఫలితాలపై అంచనాలు, బ్యాంకులు ప్రకటించిన బలమైన త్రైమాసిక అప్‌డేట్స్, ఆసుపత్రి షేర్లకు అనుకూలంగా సీజీహెచ్ఎస్ రేట్ల సవరణ వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయని నిపుణులు వివరించారు.

## ఓలా ఎలక్ట్రిక్ 'అరుదైన' ఘనత..

### రేర్ ఎర్త్‌ఫ్రీ మోటార్‌కు సర్టిఫికేషన్

**న్యూఢిల్లీ:** ప్రముఖ విద్యుత్తు వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ అరుదైన ఘనత సాధించింది. భూఅయస్కాంతాలు అవసరం లేని ఫెర్రైట్ మోటార్‌ను ఆవిష్కరించింది. సొంతంగా అభివృద్ధి చేసిన ఈ మోటారులో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ అవసరం లేదు. ఈ సర్టిఫికేషన్ అందుకున్న తొలి భారతీయ కంపెనీగా గుర్తింపు సాధించినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. ఈ కొత్త మోటార్ల వల్ల అరుదైన భూఅయస్కాంతాల దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని ఓలా ఓ ప్రకటనలో పేర్కొంది.

ఈ సరికొత్త మోటార్‌ను రూపొందించినందుకుగానూ ఓలాకు తమిళనాడులోని గ్లోబల్ ఆటోమోటివ్ రీసెర్చ్ సెంటర్ సర్టిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ నిర్దేశించిన ఏఐఎస్ 041 నియమాల ప్రకారం అన్ని పరీక్షలనూ ఓలా కొత్త మోటార్ విజయవంతంగా పూర్తి చేసిందని కంపెనీ పేర్కొంది. అరుదైన భూఅయస్కాంతాలతో తయారైన మోటార్లతో సమానమైన పనితీరును ఇదీ కనబరిచిందని తెలిపింది. పనితీరు, సామర్థ్యం, నాణ్యత.. ఇలా అన్ని విషయాల్లోనూ సమానంగా తులతూగిందని పేర్కొంది. దీంతో దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం తప్పడంతో ఆ మేర ఖర్చు కూడా తగ్గుతుందని ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది. ఆగస్టులో నిర్వహించిన 'సంకల్ప్' ఈవెంట్‌లో ఈ ఫెర్రైట్ మోటార్‌ను ఓలా ఆవిష్కరించిన విషయం తెలిసిందే. తాజాగా సర్టిఫికేషన్ పొందిన నేపథ్యంలో తమ ఉత్పత్తులకు ఓలా ఈ మోటార్‌ను జోడించనుంది.

17 లోహాలను అరుదైన భూఅయస్కాంతాలుగా పరిగణిస్తారు. స్కాండియమ్, ఎట్రియమ్, లాంథానమ్, సెరియమ్, ప్రసేడిమియమ్, నియోడైమియమ్.. తదితర లోహాలు ఇందులో ఉన్నాయి. ఎలక్ట్రిక్ మోటార్లు, విమానాలు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీలో వీటిని వినియోగిస్తారు. అయితే ఈ లోహాల కొరత ప్రస్తుతం ప్రపంచ దేశాలను కలవర పెడుతోంది. వీటిని ఉత్పత్తి చేయటంలో గుత్తాధిపత్యం ఉన్న చైనా సరఫరాలు నిలిపివేయడమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో భూఅయస్కాంతాలు అవసరం లేని మోటార్ల తయారీపై దేశీయ కంపెనీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే ఓలా ఎలక్ట్రిక్ ముందడుగు వేసింది.

# వరల్డ్ కప్ వేళ కీలక నిర్ణయం

### మిథాలీ పేరుతో వైజాగ్ స్టేడియంలో స్టాండ్..!



విశాఖపట్టణం: భారత మహిళల క్రికెట్‌కు వన్నె తెచ్చిన మిథాలీ రాజ్‌కు అరుదైన గౌరవం లభించింది. కెప్టెన్‌గా చెరగని ముద్రవేసిన ఈ వెటరన్ ప్లేయర్ పేరును స్టాండ్‌కు పెట్టాలని ఆంధ్ర క్రికెట్ సంఘం నిర్ణయించింది. విశాఖపట్టణం స్టేడియంలో అక్టోబర్ 12 భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్ సమయంలోనే మిథాలీ స్టాండ్ ప్రారంభించాలని ఏసీఏ తీర్మానించింది. ఆమెతో పాటు దిగ్గజ క్రికెటర్ రవి కల్పన పేరుతో కూడా ఒక స్టాండ్‌ను ఓపెన్ చేయనున్నట్టు ఏసీఏ తెలిపింది. 'భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన మిథాలీ రాజ్, రవి కల్పనలకు ఏసీఏ ప్రత్యేక గౌరవం కల్పిస్తోంది. తమ ఆటతో భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరి పేర్లతో స్టాండ్లను ప్రారంభించాలనుకుంటున్నాం' అని ఏసీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

మహిళల క్రికెట్‌లో మిథాలీ ఒక లెజెండ్. బ్యాటర్‌గా, సారథిగా టీమిండియాపై చెరగని ముద్ర వేసింది తను. చెక్కుచెదరని ముద్ర వేసింది తను. 1999లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మిథాలి.. 6 వేల పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పింది. రన్ మెషీన్‌గా పలు రికార్డులు బద్దలు కొట్టి 23 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు 2022 జూన్ 8వ తేదీన వీడ్కోలు పలికింది వెటరన్. కల్పన విషయానికొస్తే.. ఆంధ్రప్రదేశ్ నుంచి వికెట్ కీపర్‌గా 2015లో తొలి మ్యాచ్ ఆడింది. తను కూడా 2022లోనే రిటైర్మెంట్ ప్రకటించింది. మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న సందర్భాన్ని ప్రత్యేకంగా మలచాలనుకున్న ఏసీఏ ఈ ఇద్దరి పేర్లను వైజాగ్ స్టేడియం పెవిలియన్‌కు పెట్టాలనే కీలక నిర్ణయం తీసుకుంది.

### గిల్ వన్డే సారథి అవుతాడని
## ముందే ఊహించిన రోహిత్..

### 13 ఏళ్ల కిందటి ట్వీట్ వైరల్..!



**న్యూఢిల్లీ:** భారత వన్డే సారథిగా రోహిత్ శర్మ శకం ముగిసింది. ఆస్ట్రేలియా సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసి హిట్‌మ్యాన్‌కు షాకిచ్చింది అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ. వచ్చే వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని అగార్కర్ చెప్పినా సరే.. పలువురు అతడిని విమర్శిస్తున్నారు. ఈ ఫార్మాట్‌లో ది బెస్ట్ కెప్టెన్ అయిన రోహిత్ ఉండగా.. యువకుడైన గిల్‌కు పగ్గాలు అప్పగించడం ఏంటని? అభిమానులే కాదు మాజీలు కూడా ప్రశ్నిస్తున్నారు. అయితే..తన వారసుడిగా గిల్ వన్డే సారథ్యం స్వీకరిస్తాడని రోహిత్ ముందే ఊహించాడు. తన కెప్టెన్సీ పోతుందని పదమూడేళ్ల కిందటి ట్వీట్‌లో అతడు హింట్ ఇచ్చాడు. ప్రస్తుతం ఆ పాత ట్వీట్ నెట్టింట వైరలవుతోంది.

'ఒక అధ్యాయం (45) ముగిసింది. కొత్త శకం (77) ప్రారంభం కానుంది' అని రోహిత్ 2012లో ట్వీట్ చేశాడు. దానర్థం అప్పుడు చాలామందికి తెలియలేదు. ఎందుకంటే.. ఆ ట్వీట్‌లో రోహిత్ నేరుగా ఏమీ చెప్పలేదు. కేవలం జెర్సీ నంబర్లతో హింట్ ఇచ్చాడంతే. ఇప్పుడు ఆ పాత పోస్ట్‌ను చూస్తే.. రోహిత్ జెర్సీ నంబర్ 45. గిల్ జెర్సీ నంబర్ 77. ఒక చిన్న పోస్ట్‌తో అతడు తన వారసుడిని ఎంపిక చేసుకున్నాడు.

వన్డేల్లో 75 శాతం విజయాలతో ది బెస్ట్ కెప్టెన్‌గా ముద్రపడిన రోహిత్ ఇక ఆటగాడిగానే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నాడు. వన్డే వరల్డ్ కప్ టోర్నీకి ఇంకా రెండేళ్ల సమయం ఉన్నందున అప్పటికీ ఫిట్‌గా, ఫామ్‌తో ఉంటేనే హిట్‌మ్యాన్‌కు అవకాశం వస్తుంది. లేదంటే కుర్రాళ్లతో కూడిన జట్టునే ప్రపంచ కప్ పోటీలకు పంపుతారనడంలో ఎలాంటి సందేహం లేదు.

## అర్ధ శతకంతో మెరిసిన డెవినె



**ఇండోర్:** మహిళల వన్డే వరల్డ్ కప్‌లో బోణీ కొట్టాలనే కసితో ఉన్న న్యూజిలాండ్ రెండో మ్యాచ్‌లో భారీ స్కోర్ దిశగా సాగుతోంది. టాపార్డర్ శుభారంభం ఇవ్వడంతో కెప్టెన్ సోఫీ డెవినె (55 నాటౌట్) అర్ధ శతకంతో స్కోర్‌బోర్డును ఉరికిస్తోంది. దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికేస్తున్న ఆమెకు బ్రూక్ హల్లిడే (38 నాటౌట్) చక్కని సహకారం అందిస్తుండడంతో కివీస్ స్కోర్ 160 దాటింది. వీరిద్దరూ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. 35 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది.

ఇండోర్ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది న్యూజిలాండ్. అయితే.. మొదటి ఓవర్లోనే ఓపెనర్ సుజీ బేట్స్ (0)వికెట్ పడింది. మరినే కాప్ బౌలింగ్‌లో మొదటి బంతికే ఆమె ఎల్బీగా వెనుదిరిగింది. ఆ తర్వాత జార్జియా పిమ్మర్(31), ఆల్‌రౌండర్ అమేలియా కేర్(23)లు రెండో వికెట్‌కు 44 రన్స్ జోడించారు. దాంతో.. కివీస్ ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్నారంతా. కానీ..పవర్ ప్లే తర్వాత చొలే ట్రయాన్ బౌలింగ్‌లో అమేలియాను ఔట్ అయింది. అనంతరం పిమ్మర్, కెప్టెన్ సోఫీ డెవినె(55 నాటౌట్) జట్టు స్కోర్ సెంచరీ దాటించారు.

పిమ్మర్ వెనుదిరిగాక బ్రూక్ హల్లిడే(38 నాటౌట్) సాయంతో జట్టుకు భారీ స్కోర్ అందించే బాధ్యత తీసుకుంది డెవినె. సమయోచితంగా ఆడిన ఈ ఇద్దరూ సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. కాస్త కుదురుకున్నాక బౌండరీలతో విరుచుకుపడిన ఈ ద్వయం స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించింది. ఆస్ట్రేలియాపై కూడా హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన డెవినె, హల్లిడే దక్షిణాఫ్రికాపై కూడా ఫిఫ్టీ రన్స్‌తో చెలరేగారు. దాంతో.. వైట్ ఫెర్న్స్ టీమ్ 35 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 164 రన్స్ కొట్టింది. ఇంకా.. 15 ఓవర్లు ఉండడంతో స్కోర్ అలవోకగా 250 దాటేలా ఉంది.

### టీమిండియాతో మ్యాచ్‌లో
# 'కోడ్ ఉల్లంఘన'..

### పాక్ బ్యాటర్‌కు షాకిచ్చిన ఐసీసీ..!



**కొలంబో:** మహిళల వన్డే వరల్డ్ కప్‌లో వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన పాకిస్థాన్‌కు మరో షాక్. ఆ జట్టు టాపార్డర్ బ్యాటర్ సిద్రా అమిన్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి చర్యలు తీసుకుంది. భారత జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తను ఐసీసీ నియమావళిని ఉల్లంఘించడమే అందుకు కారణం. మ్యాచ్ అనంతరం రిఫరీ షాంద్రే ఫ్రిట్జ్ పాక్ బ్యాటర్‌పై ఐసీసీకి ఫిర్యాదు చేసింది. విచారణలో అమిన్ లెవల్ 1 తప్పిదానికి పాల్పడినట్టు గుర్తించారు. దాంతో.. ఆమెకు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించారు.

కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో భారత్ పోరాడగలిగే స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాక్‌కు ఆదిలోనే పేసర్ క్రాంతి గౌడ్ షాకిచ్చింది. 20 పరుగులకే రెండు వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన అమిన్ జట్టును గెలిపించేందుకు విశ్వ ప్రయత్నం చేసింది. నటాలియా పర్వేజ్‌తో 68 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. స్వీప్ షాట్లతో అలరించిన అమిన్ అర్ధ శతకంతో ఆశలు రేపింది. కానీ, స్నేహ్ రానా వేసిన 40వ ఓవర్లో ఐదో బంతిని స్వీప్ షాట్ ఆడగా అక్కడే కాచుకొని ఉన్న భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ముందుకు డైవ్ చేస్తూ క్యాచ్ అందుకుంది. అంతే.. టీమిండియా ప్లేయర్లు సంబురాల్లో మునిగిపోగా.. వికెట్ పడిన కోపం, ఆదవేదనతో ఆమె తన బ్యాటును పిచ్‌మీద గట్టిగా కొట్టింది.

అయితే.. అమిన్ వ్యవహరించిన తీరును ఐసీసీ తీవ్రంగా పరిగణించింది. మ్యాచ్ అనంతరం రిఫరీ అమిన్‌పై ఫిర్యాదు చేసింది. దాంతో.. పాక్ బ్యాటర్ క్షమాపణలు చెప్పింది. అయినా సరే ఆమె చేసిన నేరానికి ఒక డీమెరిట్ పాయింట్ విధించింది ఐసీసీ. మామూలుగా అయితే లెవల్ 1 తప్పిదానికి పాల్పడిన వాళ్లపై మ్యాచ్ ఫీజులో 50 శాతం కోతతో పాటు రెండు డీ మెరిట్ పాయింట్లు విధిస్తారు. భారత్ నిర్దేశించిన 248 పరుగుల ఛేదనలో అమిన్ మినహా అందరూ విఫలమయ్యారు. క్రాంతి గౌడ్ (3-20), దీప్తి శర్మ(3-45)లు మూడేసి వికెట్లతో పాక్ నడ్డి విరవగా టీమిండియా 88 పరుగుల తేడాతో జయభేరి మోగించింది.

## మహానటిలో ఏఎన్నార్ పాత్ర నా అదృష్టం

**నటుడు నాగచైతన్య వెల్లడి**



**టాకీస్:** 'మహానటి' సినిమాలో పాత్రను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు నటుడు నాగచైతన్య తెలిపారు. జీ5లో ప్రసారమయ్యే 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే, ప్రతి ఒక్కరి జీవితంలో ఒడుదొడుకులు ఉంటాయని, వాటి నుంచి పాఠం నేర్చుకొని పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు వెళ్తే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. మహానటి' సినిమా గురించి ఆయన గుర్తుచేసుకుంటూ.. 'నాగ్ అశ్విన్ నాకు 'మహానటి'లో తాతయ్య పాత్ర (ఏఎన్ఆర్) చేయాలని చెప్పగానే తప్పించుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. ఎందుకంటే ఆయన లాగా నటించడం మరొకరికి సాధ్యం కాదు. 'నేను ఏఎన్నార్‌లా చేయడం ఏంటి?. నా వల్ల కాదు. అది అసాధ్యం. మర్చిపోండి' అని నాగ్ అశ్విన్‌తో చెప్పాను. పైగా ఆ సమయంలో 'సవ్యసాచి' షూటింగ్ చేస్తున్నా. గడ్డంతో డిఫరెంట్ లుక్‌లో ఉన్నా. ఆ సినిమాలో ఏఎన్నార్ పాత్రకు ఈ లుక్ సరిపోదని కారణం చెప్పి తప్పించుకోవాలనుకున్నా. గడ్డం తీయలేనని పంపించేశా. మళ్లీ నెలన్నర తర్వాత నాగ్ అశ్విన్ నా దగ్గరకు వచ్చాడు. 'వీఎఫ్ఎక్స్‌లో గడ్డం తీసేస్తాను. ఈ క్యారెక్టర్‌లో నువ్వు మాత్రమే నటించాలి' అని పట్టుబట్టాడు. దీంతో ఓకే చెప్పానన్నారు. తర్వాత ఆలోచిస్తే ఒక విషయం అర్థమైంది. ఒకవేళ నేను చేయకపోతే వేరే నటుడు ఆ పాత్రలో చేస్తాడు. తాతయ్యగా వేరే వాళ్లు చేయడమంటే నా మనసు అంగీకరించదు. నాకు ఆఫర్ వచ్చాక.. నేనుండగా ఆ పాత్ర మరొకరు చేయడం ఏంటి? అనిపించింది. ఎవరేమనుకున్నా చేయాలి అని నిర్ణయించుకున్నా. ఆయనలాగా నేను నటించడం నాకు దక్కిన అదృష్టమని భావించాను. ఆయనపై నా ప్రేమను చూపించడానికి నాకు దక్కిన అవకాశమని అంగీకరించానని నాగచైతన్య చెప్పారు.

## గృహిణి అని గర్వంగా చెప్పండి

**అమితాబ్ బచ్చన్**



**టాకీస్:** బాలీవుడ్ షహెన్‌షా అమితాబ్ బచ్చన్ మాటలంటే ఎంత స్పెషల్‌గా ఉంటాయో అందరికీ తెలిసిందే. తాజాగా కేబీసీ షోలో బిగ్‌బీ చెప్పిన మాటలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఓ కంటెస్టెంట్‌ని ఉద్దేశించి ఆయన.. చాలామంది మహిళలు 'నేను గృహిణిని' అని చిన్నగా అంటారు. కానీ ఇది చిన్న విషయం కాదు. గర్వంగా చెప్పండి! ఇంటి పనులు చూసుకోవడం, కుటుంబాన్ని కాపాడుకోవడం అంటే పెద్ద బాధ్యత' అని చెప్పడం అక్కడ ఉన్నవారినే కాదు, టీవీ ముందు చూసిన వాళ్లను కూడా ఇన్‌స్పైర్ చేసింది.ఇంకా ఆయన ఒక ఇంట్రెస్టింగ్ పాయింట్ షేర్ చేశారు. 'కోవిడ్ సమయంలో పురుషులు ఇంటి పనులు చేయాల్సి రావడం తో, గృహిణుల కష్టాలెంత కఠినమో అర్థమైంది' అన్నారు. బిగ్‌బీ చెప్పిన ఈ మాటలు వేదికపైనే చప్పట్ల వర్షం కురిపించాయి. నిజంగానే కదా.. మనం సాధారణంగా తీసుకునే 'ఇంటి పనులు' వెనుక అంత కష్టం, డెడికేషన్ ఉంటుందని ఆయన ఒక్క మాటలో చెప్పేశారు. అదే కాకుండా, ఇటీవల జరిగిన మహిళల క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌పై సాధించిన అద్భుత విజయాన్ని కూడా బిగ్‌బీ ప్రత్యేకంగా ప్రశంసించారు. 'భారతదేశానికి వీళ్లు అతిపెద్ద సంపద' అంటూ ట్వీట్ చేశారు. ఇలా ఎప్పటికప్పుడు పాజిటివ్‌గా మాట్లాడే అమితాబ్ బచ్చన్ కామెంట్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.



# చాలాకాలం తరువాత మళ్లీ తెర మీదకు సమంత

## 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు



టాకీస్: స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్‌కి రాబోతున్నారు. హెల్త్ ప్రాబ్లం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ ఇచ్చిన సమంత తర్వాత ప్రొడ్యూసర్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరిట 'శుభం' మూవీతో నిర్మాతగా తన అడుగులు పెట్టి మొదటి చిత్రం తోనే హిట్ అందుకుంది. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు రాబోతుంది. గతేడాది ఈ మూవీ నుండి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సమంత గన్, మెడలో తాళి బొట్టు, రక్తంతో నిండిన ముఖంతో ఫుల్ డ్రామా లుక్‌లో కనిపించారు. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఆ అప్‌డేట్ కోసం సోషల్ మీడియా ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఈ నెలలోనే 'మా ఇంటి బంగారం' షూటింగ్ ప్రారంభం అవుతుంది అంటూ సమంత స్వయంగా తెలిపారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. చాలా రోజుల తర్వాత సమంతను మళ్లీ స్క్రీన్‌లో చూడబోతున్నాం అంటూ మురిసి పోతున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ వార్త ట్రెండ్ అవుతోంది.

## క్రికెటర్ సచిన్‌తో ప్రయాణం జీవితంలో మరవలేని అనుభూతి: తమన్

**టాకీస్:** ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ మరోసారి వార్తల్లో నిలిచారు. సంగీతంతో ప్రేక్షకుల మనసు దోచుకుంటూనే, సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ అభిమానులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ఉంటారు. తాజాగా తమన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఇందులో ఆయన తనకు తారసపడిన అరుదైన క్షణాన్ని అభిమానులతో పంచుకున్నారు. డల్లాస్ నుండి దుబాయ్‌కు వెళ్తున్న సమయంలో తనతో కలిసి ప్రయాణించిన క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ గురించి ట్వీట్ చేస్తూ, ఆయనతో దిగిన ఫోటోను పోస్ట్ చేశారు. క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ గారితో డల్లాస్ నుంచి దుబాయ్ వరకు ప్రయాణించడం గొప్ప అనుభవం. ప్రయాణ సమయంలో మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. సీసీఎల్ మ్యాచ్‌లలో నా బ్యాటింగ్ వీడియోలు



చూపించాను. చూసిన వెంటనే సచిన్ 'నీ బ్యాట్ స్పీడ్ అద్భుతంగా ఉంది' అని ప్రశంసించారు. ఇది నా జీవితంలోని గొప్ప క్షణం. త్వరలోనే ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావొచ్చు' అంటూ తమన్ పేర్కొన్నారు.తమన్ చివరిగా 'త్వరలో కలిసి పని చేయొచ్చు' అనే వ్యాఖ్య నెటిజన్లలో ఆసక్తిని రేపుతోంది. దీనిపై సోషల్ మీడియాలో వివిధ ఊహాగానాలు వెలువడుతున్నాయి.

## నాగశౌర్య కొత్త సినిమా బ్యాడ్ బాయ్ కార్తీక్

**టీజర్ విడుదల చేసిన మేకర్స్**

**టాకీస్:** నాగశౌర్య ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. విధి కథానాయిక. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్ కథతో దీనిని తెరకెక్కించినట్లు టీజర్ ఆధారంగా అర్థమవుతోంది. నటి పూర్ణ సీరియస్ లుక్‌లో కనిపించగా.. సాయి కుమార్ పోలీస్ పాత్రలో తనశైలిలో డైలాగ్ చెప్పారు. ఛలో సినిమాతో సూపర్ హిట్ అందుకుని బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ వచ్చిన నాగశౌర్య కొంత కాలంగా సైలెంట్ అయ్యాడు. చివరిగా 2023 లో రంగబలి అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఆ సినిమా కూడా యావరేజ్ టాక్ తెచ్చుకుంది. దాంతో సినిమాలకు లాంగ్ గ్యాప్ ఇచ్చేసాడు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులని అలరించటానికి వస్తున్నాడు. నూతన దర్శకుడు రామ్ దేశిన దర్శకత్వం వహించిన ఈ సినిమాను



ఎప్పుడో ప్రకటించాడు శౌర్య. ఎప్పటినుండో సెట్స్ పై ఉన్న ఈ సినిమా టీజర్ ను ఈ రోజు రిలీజ్ చేసారు మేకర్స్. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా బ్యాడ్ బాయ్ కార్తీక్ టీజర్ ను రిలీజ్ చేసారు. భారీ టార్గెట్స్, రొటీన్ డైలాగ్స్ తో నింపేసారు. ఇక చివర్లో వెన్నెల కిషోర్ తో ఏదో కామెడీ అని ట్రై చేసారు. ఓవరాల్ గా చూస్తే బ్యాడ్ బాయ్ కార్తీక్ ఒక రొటీన్ కమర్షియల్ టీజర్ లానే అనిపిస్తోంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మరియు శ్రీదేవి విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## బాలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ కొట్టేసిన శ్రీలీల

**బాలీవుడ్‌లో రెండో ఆఫర్ కొట్టేసిన శ్రీలీల**

**కరణ్ జోహార్ మూవీలో శ్రీలీలకు ఛాన్స్**

**ఇప్పటికే కార్తిక్ ఆర్యన్ మూవీలో నటిస్తున్న శ్రీలీల**

టాకీస్: టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో పాటు చలాకీతనంతో యువతను ఆకట్టుకుంటున్న శ్రీలీల, ఇప్పుడు బాలీవుడ్ వైపు తన అడుగులు వేగవంతం చేస్తోంది. ఇప్పటికే ఒక హిందీ సినిమాలో నటిస్తున్న శ్రీలీల... ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే... ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మిస్తున్న 'దోస్తానా 2' సినిమాలో శ్రీలీలను హీరోయిన్‌గా దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నేషనల్ అవార్డు గ్రహీత విక్రాంత్ మాస్సే హీరోగా నటిస్తున్నారు. వాస్తవానికి, ఈ పాత్ర కోసం ముందుగా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. దీంతో ఆ అద్భుత అవకాశం శ్రీలీలను వరించినట్టు బాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం దీనిపై నిర్మాత కరణ్ జోహార్ తుది చర్చలు జరుపుతున్నారని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే శ్రీలీల, బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తిక్ ఆర్యన్ సరసన ఒక సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే ఇప్పుడు రెండో అవకాశం కూడా ఆమె తలుపు తట్టడంతో, బాలీవుడ్‌లో శ్రీలీల కెరీర్ దూసుకుపోవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండు పెద్ద ప్రాజెక్టులలో అవకాశాలు రావడంతో, శ్రీలీల బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడం ఖాయమని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.